# మార్పు

—సి. చంద్రశేఖర్

ఒరే! ఈరిగా, ఎక్కడ సచ్చినవు. గంట పొద్దు నుంచి మొత్తుకుంటున్న బర్రెకు కుడితిపెట్టు." రెడ్డి.

"యీరిగా! నీ కెన్నిసార్లు చెప్పినరా! దొంగబతుకు బతక్కూడదని. కండ్లెదుటుంటే పని చెప్తరని సాటుకు తిరుగుతవు" అమ్మగారు.

"లేదమ్మగోరూ! సిన్నమ్మ పట్నం తోలించింది కారట ఏసిరమ్మని."

"వీరాయ్! వచ్చావట్రా, ఉత్తరం పోష్టు చేశావా?" చిన్నమ్మగారు వసరాలోకి వచ్చి వెళ్ళారు.

"అరేయే! నీవేమో పనికి వోపవు. నీ తాత ఎట్ల చేసిండు పని. ఇంటోళ్లే అవసరం లేకుండిరి: సొంతం పనిలాగ చేసెవోడు. నీ అయ్యమాత్రం! వొళ్లు వంచి పని చేసెటోయి. సచ్చినంతవరకు మమ్మల్ని ఇడవ లేదు యిసువాసమంటే అట్లుండాలిరా! నీ లగ్గానికి పైకం కావాలని సర్కి.... అదే నీ అమ్మ వచ్చిందే, నీ విట్ల పని చేస్తే పెళ్లి చేసుకున్నట్లే!" రెడ్డి లెక్చర్ వీరయ్య వినలేదు. బర్రెకు కుడితి పెట్టున్నాడు.

వీరయ్యకు ఈ మధ్య పని చేయాలని పించుటలేదు. వోపిక నశించి నట్లుంది. చేసే పని తృప్తిగా చేస్తలేదు. మానశిక సంఘర్షణలో మథన పట్తున్నాడు. ఆ రోజునుంచి... వెంకటయ్య చెప్పినప్పట్నుంచి. నిజాన్ని గుర్తించాడు.

"మన బ్రతుకులు బ్రతుకులేనా? మన తాతలనుంచి మన పిల్లల వరకు కూడా జీతగాండ్లగా ఉండి, ఎట్టి చాకిరి చేసి, బానిసల్లె బ్రతుకులు బ్రతకాలా? మనం శ్రమపడి పొలంలో పంటలు పండించాలె. కాలు మీద కాలేసుకొని హాయిగా బ్రతుకుతారు యజమానులు. కష్టం చేయాలి బానిసలుగా బ్రతకాలి. ఇంటి ముందున్న కుక్కకన్న మంచి తిండి పెడ్తరు. మనకు ఏ సద్దన్నమో వేస్తారు" అంతరిలో పాటు వీరయ్య వింటున్నాడు అనాడు కొత్త విషయాల్ని వింటున్నాడు. గుడ్లు ఒక్కసారి చూసి మళ్ళి చెప్తున్నాడు వెంకటయ్య. "ఈ భూమిమీద అందరం మనుషులుగా పుట్టినం. గాలి, నీరు, వేడిని సమానంగ అనుభవిస్తున్నాం. మన బ్రతుకులు సమానంగ ఎందుకుండ కూడదు? అందరం కష్టపడాలి. తింటె అందరం పరమాన్నమే తినాలి. లేకపోతే గంజి తాగాలి. కష్టపడేది ఒకరైతే ఫలం వేరొకరు. మేడల్లో కూర్చునే వారొకరు ఇదేనా న్యాయం. ఈ దోపిడి వాని సర్వం రూపుమాపాలి."

"అందుకే చెప్తున్నాను కష్టించి మనం పండించిన పంటలను మనమే అనుభవించాలి. దున్నేవాడిదే భూమి. ప్రాణాలు తీసి అయినా, ప్రాణాలర్పించినా సరె! మన ప్రయత్నం మానకూడదు విపరీత ఆవేశం ధ్వనించింది కంఠంలో.

* * *

"ఏంరా! పక్కకేస్తున్నావు కూడును."

"మనుషులు తినే కూడు కాదు. వాసన కొట్టుంది. దాన్ని తినే కంటే ఉపాసం ఉండేది మేలు."

"ఏం కూశావ్! ఎదవా. మనుషులు తినేది కాదా? వొక పక్క కూడు లేక మాడుతున్న ఎమ్ములు పోసేయరు. మీ గుడిసెల్లో తాగ

నికె మంచినీళ్ళు కూడా గతిలేవు కదరా!

"మా కష్టానికి ఫలితముంటె మి కంటె గొప్పగ బతుకు తుంటిమి."

"ఏం ఎదవా, బొగురెక్కి నట్టుంది. పుణ్యానికి కష్టం చేస్తున్నారా ?"

"మాటి మాటికి ఎదవా, అంటున్నావు. కడుపు కాలేకున్న. నీతిగ బతికినం."

"కండ్లు నెత్తికెక్కినయ్యా. నాకే ఎదురై మాట్లాడు తావా ?" అం టూ చెప్పులతో కసితీర కొట్టి, బయటకు నెట్టాడు.

* * *

"అయ్యో....ముదనష్టపు ఎదవా! ఎంత అన్నేయం చేసినవు. అంతటి రెడ్డి మిదికి తిరగపడినవు. తనని కాదని యీ కొంపలో ఎట్ల బతికేది." వీరయ్యపై తల్లి లేచింది. వీరయ్య గుడిసెలో మౌనంగా కూర్చున్నాడు.

"నా కడుపున సెడపుట్టినవు. నీ అయ్య, తాత ఎంత మంచి పేరు పొందిన్రని. పో రా! దొర కాళ్లు పట్టుకొని తప్పైందనీ ఏడుకో, పనిలోకి చేరు."

"సీ! నీ ఏడ్పుకాల వొక్కటె సాధింపు పెట్టినవు ఏం ఆయన లేకపోతె బతక లేమా ?"

"దొర ఎల్లగొట్టినోడికి పనెవరిస్తరు."

"మాటి మాటికి ఆయన్ని దొర అంటు న్నావు. మనలాంటి మనిసే. దేవుడు కాదు."

"ఎంత మాట! ఎంకటిగాడు నిన్ను సెడ గొట్టిండు. వోనయ్య దొరలకు ఎదురు తిరిగి నందుకే నాశనమయిండు. యీడు అయితడు. దొరలు. దొరలు కాకుండ ఎట్లయితరు. నీవు వోడిజత యిడవాలే, నేకపోతె సెడిపోతవు."

"నీగోల పడలేను." అంటూ లేచి వెళ్ళి పోయాడు వీరయ్య. యింటిని విడిచిన వీరయ్య తిరిగి రాలేదు. వెంకటయ్య చెప్పిన గుర్తుల ప్రకారం కొండలలోకి వెళ్ళాడు.

# వైద్య సలహాలు

రుక్మాంగదరెడ్డి, మడికొండ.

ప్ర: నా వయస్సు 23 సం॥లు. నేను **"Muscular Dystrophy"** తో బాధపడు చున్నాను. ఇది వరకు ఎంత దూరమైనా నడువకలేవాడిని. ప్రస్తుతం కొద్దిదూరంకూడ నడువలేను....

జ: దీనికి కారణం తెలియదు. ఇది వంశ పారంపర్యంగా వచ్చే జబ్బు కాదు. కాని అక్కడక్కడ వంశ పారంపర్యంగా వచ్చి నట్లు తెలుస్తూంది. మగ పిల్లల్లో, ఇది ఎక్కు వగా కనబడుతూంది

దీనికి చికిత్స అనేదే లేదు. తోటపని, అవయవాలు శక్తితో కదిలించటంచే, కండ రాలు బిగుసుక పోకుండా ఉండును.

నడవటం అలవాటు చేసుకోవాలి.

టి. వెంకటేశ్వర్రావు, రేలంగి

ప్ర: పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకొని సుమారు 6 సం॥ అయినవి. బాగానే వున్నది. 4నెలలనుంచి వెన్నుఎముక వద్ద లాగుతున్నట్లు నెప్పిగా ఉంటూన్నది. ఒక గంట కూర్చోలేను. పటు. పట్టినట్లుం టూన్నది....

జ: కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌కు, దీనికి సంబంధం లేదు. ఈ ఆపరేషన్‌లో, ఇంద్రియాన్ని మోసుకొనిపోయే గొట్టాన్ని విచ్ఛేదంచేస్తారు ఇంద్రియం స్త్రీ అవయవం లోకి పోటానికి వీలు లేదు. అంతేగాని, మోకాళ్ళ నొప్పులకు, వెన్నుఎముక నొప్పికి ఎలాంటి సంబంధంలేదు. చాలమంది మానసిక రుగ్మలుకూడ ఈ ఆపరేషన్‌కే ఆపాదిస్తారు.

మిరు చెప్పే జబ్బులు వేరే అయినవి. వైద్య నిపుణినితో సంప్రదించండి.

–డా॥ జొన్నలగడ్డ వీరాస్వామి